కనుల ముందు కదలాడే.. నాటి స్మృతులు

SUNDAY SPECIAL

ఎన్నో చారిత్రక అంశాలు, ప్రత్యేకతలున్న ప్రాంతం పాతనగరం. వందల ఏళ్ల నాటి ఇక్కడి కట్టడాలు బ్రిటిష్ పాలన నాటి రోజులను గుర్తు చేస్తాయి. అలాగే మన జాతీయ నాయకుల స్మృతులను కూడా జ్ఞప్తికి తెస్తాయి. తెల్లవారి పాలనపై తిరుగుబాటు సమయంలో ఈ ప్రాంతపు నాయకులు రహస్యంగా సమాలోచనలు జరిపేవారని పెద్దలు చెబుతుంటారు. అటువంటి పురాతన చరిత్ర గల టౌన్‌హాల్, కురుపాం మార్కెట్ ప్రాంతంలో గల సిద్ధి వినాయక ఆలయం, క్వీన్‌మేరీ పాఠశాల వంటివి నేటికీ నాటి గుర్తులను మన కళ్ల ముందు ఉంచుతాయి.


గాంధీజీ వాణి వినిపించిన టౌన్‌హాల్

- 200 ఏళ్ల నాటి **చదువుల వనం క్వీన్‌మేరీ పాఠశాల**
- గాంధీజీ ప్రసంగి**ంచిన టౌన్‌హాల్**
- రెండు శతాబ్దాల **నాటి** సిద్ధి వినాయక **ఆలయం**


అనాథ శరణాలయంగా, ఆస్పత్రిగా, చదువుల నిలయంగా సేవలందిస్తున్న క్వీన్‌మేరీ పాఠశాల

దాబాగార్డెన్స్: పాత నగరం ప్రాచీన చరిత్రకు ఆలవాలం. ఇక్కడ ఏ ప్రాంతాన్ని పరిశీలించినా ఏదో చారిత్రక సంబంధమైన అంశం గోచరిస్తుంది. ఆ అంశాల గురించి పెద్దల ద్వారా తెలుసుకుంటే తెలియని అనుభూతి కలుగుతుంది.

200 ఏళ్ల నాటి చదువుల చెట్టు..

ఇప్పుడైతే ఆ భవంతి విద్యాలయంగా ఉంది కానీ రెండు వందల సంవత్సరాల క్రితం అది అనాథ శరణాలయం. దీనిని పునరుద్ధరించాక వీధి బాలలు, అనాథలకు ఆశ్రయమిచ్చే కేంద్రంగా గుర్తింపు పొందింది. మరో అర్ధ శతాబ్దం కలెక్టర్ పేషీగా మనుగడ సాగించింది. మధ్యలో బ్రిటీష్ సేనల ఆయుధాగారంగా.. కొన్నేళ్లు ఆస్పత్రిగా కూడా చరిత్రకెక్కింది. అక్కడి నుంచి ఇప్పటి వరకు చదువుల నిలయంగా సేవలందిస్తోంది. శతాబ్దాల చరిత్రకు ఆలవాలమైన ఈ భవనమే నాటి బ్రిటన్ మహారాణి పేరు మీద నిర్మితమై.. ఇప్పటికీ మనుగడ సాగిస్తున్న క్వీన్‌మేరీ పాఠశాల. ఏ ముహూర్తాన ఈ భవనం విద్యాలయంగా గుర్తింపు పొందిందో కానీ అప్పటి నుంచి ఇప్పటి వరకు.. వందేళ్లకు పైబడి పాఠశాలగానే కొనసాగుతూ ఉండడం విశేషం. జీవీఎంసీ పరిధిలో ప్రభుత్వ నిర్వహణలో గల మొదటి పాఠశాల క్వీన్‌మేరీ పాఠశాల అన్నది చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతుంది.

నిర్మాణంలో విశిష్టత..

వరండాలో మూడు ఆర్చిలతో నిర్మితమైన ఈ భవనం పైకప్పు రెండు భాగాలుగా విభజించబడి ఉంది. గదుల్లో శ్లాబ్ కింద పెద్దపెద్ద చెక్కదూలాలు అమర్చారు. పైభాగం.. కింద భాగం ఒకేలా ఉండేలా నిర్మించడం విశేషం. ఈ భవనాన్ని పై నుంచి చూస్తే ఏడు అంకెలా కనిపిస్తుంది. పై అంతస్తుకు చేరుకునేందుకు రెండు మెట్ల మార్గాలు ఏర్పాటు చేశారు. ప్రతి రెండు స్తంభాలపై ఆర్చిలు ఏర్పాటు చేశారు. పై కప్పును పెంకులతో నిర్మించారు.

గాంధీజీ సందేశం ప్రతిధ్వనించిన 'బ్రిటీష్'మందిరం..

అలనాటి స్వరాజ్య పోరాటంలో విశాఖ విశేష పాత్ర పోషించింది. మహాత్ముడి స్వరం ఇక్కడ ప్రతిధ్వనించింది. నాడు గాంధీజీ వాణి ప్రతిధ్వనించి తెల్ల దొరలకు ముచ్చెమటలు పట్టించింది. ఆ ప్రసిద్ధి పొందిన కట్టడమే ఇప్పటికీ సాగరతీరంలో నిలిచి ఉన్న టౌన్ హాల్. ఆంగ్లో ఇండియన్ వాస్తుకళకు దర్పణంగా నిలిచే ఈ భవనం నగరంలో స్వాతంత్రోద్యమ పరిణామాలకు సాక్షిగా నిలిచింది. టౌన్‌హాల్‌ను 1901లో బొబ్బిలి రాజైన వెంకటేశ్వర చలపతి రంగారావు బహదూర్ విక్టోరియా రాని సామ్రాజ్యపు వజ్రోత్సవాల సందర్భంగా నిర్మించారు. 1906లో వందేమాతరం ఉద్యమం నేపథ్యంలో జాతీయ నేతలు బిపిన్ చంద్రపాల్, ఎస్ఎస్ రామస్వామి టౌన్‌హాల్ వద్ద బహిరంగ సభ నిర్వహించారు. తర్వాత టౌన్‌హాల్ వేదికగా ఎన్నో రాజకీయ సభలు జరిగాయి. ఉప్పు సత్యాగ్రహానికి, శాసనోల్లంఘనకు 1930లో టౌన్‌హాల్ వేదికగా మారింది. స్థానిక నేతలు మారేపల్లి రామచంద్రకవి, దిగుమర్తి వెంకట రామస్వామి, తెన్నేటి విశ్వనాథం, కొల్లూరు సూర్యగుప్త, దిగుమర్తి జానకీబాయి టౌన్‌హాల్ నుంచి సముద్రతీరానికి వెళ్లి ఉప్పు తయారు చేసి బ్రిటీష్ శాసనాన్ని ధిక్కరించారు. 1929 ఏప్రిల్ 28న టౌన్‌హాల్ వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మహాత్మాగాంధీ ఖద్దరు ఆవశ్యకత గురించి ప్రసంగించారు. 1933లో రెండో సారి విశాఖ వచ్చిన మహాత్ముడు మళ్లీ టౌన్‌హాల్ వద్ద జరిగిన బహిరంగ సభలో మాట్లాడారు. అలా స్వరాజ్య సమరానికి టౌన్‌హాల్ ఓ వేదికగా మారింది.

సిద్ధి వినాయక ఆలయం..

పాతనగరం కురుపాం మార్కెట్‌లోని సిద్ధి వినాయక ఆలయం నగరంలోని పురాతన ఆలయాల్లో ఒకటి. 200 ఏళ్ల క్రితం బ్రిటీష్ పాలన కొనసాగుతున్న రోజుల్లో ఇప్పటి కురుపాం మార్కెట్‌కు చేరువలోని పాత సాలి పేటలో ఈ కోవెల నిర్మించారు. అప్పట్లో ఇక్కడ నీటికి కరవు వచ్చినప్పుడు బావి తవ్వుతుండగా వినాయకుని విగ్రహం బయట పడిందన్నది ప్రచారంలో ఉన్న గాథ. ఆ విగ్రహాన్ని వెంటనే ప్రతిష్ఠించారని, కాలక్రమంలో ఆలయం నిర్మించారని అంటారు. పిల్లల వివాహాలకు ఆటంకాలు ఎదురైనప్పుడు, బిడ్డలు పుట్టడం ఆలస్యం అయినప్పుడు ఈ స్వామికి మొక్కుకుంటే ఫలితం ఉంటుందని భక్తులు విశ్వసిస్తారు. భక్తులే స్వయంగా స్వామిని అర్చించుకోవడం ఇక్కడి ప్రత్యేకత. అంతే కాదు.. ఈ స్వామి విగ్రహానికి ఎడమ పార్శ్వం ఉండకపోవడం మరో ప్రత్యేకాంశం.

క్లుప్తంగా

మహిళకు వాసుపల్లి ఆర్థికసాయం


ఆర్థిక సాయం చేస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: దుకాణం రేకుల షెడ్డు నిర్మాణానికి పేద మహిళకు మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆశీల్‌మెట్ట అశోక్‌నగర్‌లో గల తన కార్యాలయంలో రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో స్టూడియో నిర్మాణానికి తన వంతు సాయం అందించానన్నారు. సేవే పరమావధిగా, ప్రజలే దేవుళ్లుగా భావిస్తూ ప్రజలకు తాను ఎప్పుడూ ఓ కుటుంబ సభ్యునిగా ఉంటున్నానని, వారి కష్టంలో తనకు తోచిన సహాయం అందించడం నా బాధ్యతని పేర్కొన్నారు.

జీవీఎంసీ సిబ్బంది సేవలు శ్లాఘనీయం


పారిశుధ్య సిబ్బందికి చీరలు అందజేస్తున్న కందుల నాగరాజు

అల్లిపురం: జీవీఎంసీ సిబ్బంది సేవలు శ్లాఘనీయమని 32వ వార్డు కార్పొరేటర్ కందుల నాగరాజు అన్నారు. నేరెళ్లకోనేరులో కార్పొరేటర్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజయవాడ వరదల్లో అక్కడ ప్రజలకు సేవలందించిన పారిశుధ్య సిబ్బందిని ఆయన సత్కరించారు. మహిళా సిబ్బందికి చీరలు అందజేశారు. విజయవాడ వరదల్లో పారిశుధ్య సిబ్బంది ఇతోధికంగా సేవలు అందించారని కొనియాడారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాశీరావు, కార్యదర్శి కనకరాజు, నారా నాగేశ్వరరావు, కందుల రాజశేఖర్, ఎం.శాలివాహన, సీపీఐ బుజ్జి, వై.ఆదిబాబు తదితరులు పాల్గొన్నారు.

స్టేషన్ బెయిల్‌తో సత్వర న్యాయానికి అవరోధం


మాట్లాడుతున్న న్యాయవాది ఐ.ఎం.అహ్మద్

అల్లిపురం: స్టేషన్ బెయిల్ వల్ల సత్వర న్యాయానికి అవరోధమని సీనియర్ న్యాయవాది, ఫోరం కన్వీనర్ ఐఎం అహ్మద్ అన్నారు. జిల్లా కోర్టు ఎదురుగా గల రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు బైపా అరుణకుమార్ కార్యాలయంలో జరిగిన 41ఎ సీఆర్‌పీసీ స్టేషన్ బెయిల్ ప్రక్రియపై జరిగిన చర్చలో ఆయన పాల్గొన్నారు. ఒక్క తీర్పు తప్ప అన్ని అధికారాలను ఎంక్వైరీ నెపంతో పోలీసులకు అప్పగించడం వల్ల అధికార దుర్వినియోగం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. లాయర్స్ ఫోరం ఫర్ సోషల్ జస్టిస్ అధ్యక్షుడు గుడిపల్లి సుబ్బారావు మాట్లాడుతూ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవాలన్నా, అధికార దుర్వినియోగాన్ని అడ్డుకోవాలన్నా తక్షణం స్టేషన్ బెయిల్ విధానాన్ని ఆపాలని ఆయన డిమాండ్ చేశారు. పాత బెయిల్ విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ఉద్యమానికి బైపా అరుణకుమార్ తదితరులు సంపూర్ణ మద్దతు తెలిపారు. సీనియర్ న్యాయవాది డాక్టర్ టి.బోసుబాబు పాల్గొన్నారు.

బల్లిగిరికి పోటెత్తిన భక్తులు

అల్లిపురం: కార్తీక మాసం రెండవ శనివారం సందర్భంగా బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వర స్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకుడు గొడవర్తి రాఘవాచార్యులు స్వామి వారిని పలు రకాల పూలతో అలంకరించి ప్రత్యేక పూజలు జరిపారు. మంగళవారం 12వ తేదీన కార్తీక శుద్ధ ఏకాదశి సందర్భంగా విశేష పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో జీవీ రమాబాయి తెలిపారు. ఆ రోజు తెల్లవారి 4 గంటల నుంచి స్వామి వారికి విశేష అర్చనల అనంతరం భక్తులకు దర్శనాలు కల్పించనున్నట్లు తెలిపారు.

స్టెరాయిడ్లతో హార్మోన్లకు చేటు

మహారాణిపేట: శరీర సౌష్టవం కోసం పలువురు స్టెరాయిడ్లు వాడుతున్నారని, అవి హార్మోన్లకు హాని చేస్తాయని ఎండోక్రైనాలజిస్టులు చెబుతున్నారు. విశాఖ బీచ్‌రోడ్డులోని ఒక హోటల్లో జరిగిన ఎండోక్రాన్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఇసికాన్-2024) 53వ వార్షిక సదస్సులో దేశ, విదేశాల నుంచి వచ్చిన పలువురు ఎండోక్రైనాలజిస్టులు 'సాక్షి'తో మాట్లాడారు.

జీవన విధానంలో మార్పుతో సమస్యలు



జీవన విధానంలో మార్పుల వల్ల ఇప్పుడు చిన్నపిల్లల్లో సైతం చక్కెర వ్యాధి, థైరాయిడ్ సమస్యలు వస్తున్నాయి. రాత్రిళ్లు సెల్‌ఫోన్ చూసుకోవడం, మధ్యాహ్నం 12 గంటలకు లేవడం, జంక్‌ఫుడ్ తినడం వల్ల ఎక్కువ మందిలో ఊబకాయం వస్తుంది. దీని వల్ల చక్కెర వ్యాధి సోకుతుంది.

– **డాక్టర్ కేవీఎస్ హరికుమార్**, ఎండోక్రైనాలజిస్టు, హైదరాబాద్, ఎండోక్రాన్ సొసైటీ ఆఫ్ ఇండియా (ఇసికాన్-2024) ప్రధాన కార్యదర్శి

అవగాహన లేక ఇబ్బందులు



అవగాహన లేకపోవడం వల్ల ఎక్కువగా స్త్రీలకు తొలుత థైరాయిడ్ సోకుతుంది. ఆ తర్వాత చక్కెర వ్యాధి వస్తుంది. దీని నివారణకు నాటు మందులు వినియోగిస్తున్నారు. దీని వల్ల ఆరోగ్యం చెడిపోవడంతో పాటు హార్మోన్లలో మార్పులు వస్తున్నాయి. ఈ పరిస్థితిల్లో ఊబకాయం, చర్మం పొడిబారడం, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం వంటివి కనిపిస్తాయి.

– **డాక్టర్ ఎంవీ రామమోహన్**, నెల్లూరు ఎండోక్రైనాలజిస్టు

సీపీ క్రైం రికార్డ్సు బ్యూరో కార్యాలయం సందర్శన


సీసీఆర్‌బీ కార్యాలయంలో తనిఖీలు చేస్తున్న సీపీ బాగ్చీ

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చీ సిటీ క్రైం రికార్డ్సు బ్యూరో కార్యాలయాన్ని సందర్శించారు. అక్కడి రికార్డులను పరిశీలించారు. నగరంలో లా అండ్ ఆర్డర్ అదుపులో ఉంచుతూ, అంతా ప్రశాంతంగా ఉండేలా ఇప్పటికే పలు క్రైం, లా అండ్ ఆర్డర్, ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు, పలు ఏసీపీ సబ్ డివిజన్లు, స్పెషల్ బ్రాంచి ఆఫీస్, ఏఆర్ ఆఫీసు విభాగాలను పరీక్షిస్తున్నారు. సీసీఆర్‌బీని సందర్శించిన సీపీ అక్కడి సమస్యలు, కేసుల రికార్డులు పరిశీలించి, అధికారులకు ఆదేశాలు జారీ చేశారు.

వేడుకగా బంతిపూల (బతుకమ్మ) గౌరమ్మ


బంతిపూల (బతుకమ్మ) గౌరమ్మలతో మహిళల ఆట పాటలు

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం, గౌరీ సంఘం సంయుక్త ఆధ్వర్యంలో శ్రీ గౌరీ పరమేశ్వరుల మహోత్సవాలు, 77 వసంతాల వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నారు. దీంట్లో భాగంగా శుక్రవారం రాత్రి శ్రీ గౌరీ మహిళా సేవా సంఘం సభ్యులు ఘనంగా బంతిపూల (బతుకమ్మ) గౌరమ్మ వేడుకలు నిర్వహించారు. ఆట పాటలతో అమ్మవారి పాటలు పాడుతూ అలరించారు. అనంతరం కోలాటం గ్రూపులు ప్రదర్శించిన కోలాటాలు భక్తులను ఉత్సాహపరిచాయి. ఈ సందర్భంగా గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి శ్యామ్ కుమార్, శ్రీను మాట్లాడుతూ ఈ నెల 11న శ్రీ గౌరీ పరమేశ్వరుల కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

హామీల అమలులో కూటమి ప్రభుత్వం విఫలం


ప్రజాపోరు పోస్టర్ విడుదల చేస్తున్న దృశ్యం

జగదాంబ: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో విఫలమైందని సీపీఎం పార్టీ జగదాంబ జోన్ నాయకుడు శేఖర్ అన్నారు. శనివారం పూర్ణామార్కెట్ దరి స్ప్రింగ్‌రోడ్డు వద్ద ప్రజాపోరు పోస్టర్ విడుదల చేసి మాట్లాడారు. కూటమి ప్రభుత్వ హయాంలో ప్రజలపై ధరల భారం మోపుతుందన్నారు. కరెంటు చార్జీలు పెంచి ప్రజలను మోసం చేస్తుందని, ఉచిత ఇసుక పేరుతో డబ్బులు వసూలు చేస్తుందని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆపేస్తామని గొప్పలు పలికిన పవన్ కల్యాణ్ ఇప్పుడు తిరుపతి లడ్డూ, సనాతన ధర్మం అని అసలు సమస్య నుంచి ప్రజల దృష్టి మళ్లించే రాజకీయాలు చేయడం మోసం చేయడమే అవుతుందన్నారు. ప్రజా సమస్యలపై సీపీఎం పిలుపు మేరకు ఈనెల 14 వరకు జరుగుతున్న ప్రజాపోరు కార్యక్రమంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడతామని శేఖర్ తెలిపారు. సమస్యలపై ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే మంత్రుల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జోన్ కార్యదర్శి ఎం.సుబ్బారావు, కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

'మేలు చేయని నాయకులను నమ్మొద్దు'

దాబాగార్డెన్స్: మాల మహానాడు ఎస్సీ కులాల వర్గీకరణకు వ్యతిరేకమని, తమ సంస్థ పేరు చెప్పుకుని కొంత మంది స్వార్థ ఎస్సీ నాయకులు రాజకీయ పార్టీలతో చేతులు కలిపి తమకు చెడ్డపేరు తీసుకొస్తున్నారని మాల మహానాడు వ్యవస్థాపక కార్యదర్శి భాగం గోపాలరావు తెలిపారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ప్రకటించుకుని ఎస్సీల సంక్షేమం కోసం ఏదో చేస్తున్నట్టు ప్రకటిస్తున్నారని అటువంటి వారిని నమ్మొద్దన్నారు. ఈ మేరకు శనివారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను 19 ఏళ్లుగా దళిత జాతికి సేవ చేయాలన్న దృక్పథంతో పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి రాజీనామా చేసి సేవలందిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికైనా ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా రాష్ట్ర ఉద్యమాన్ని నడిపించే నాయకుడు వస్తే సహకరిస్తామన్నారు. ఎంవీ శివ, కె.ఈశ్వర వీర కుమార్, ప్రసాద్, బి. వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి సహస్ర తులసీదళార్చన

దాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో శనివారం సహస్ర తులసీదళార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో, అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వసతిగృహానికి పలువురి తరలింపు

సీతమ్మధార: రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్) సమక్షంలో ఏయూటీడీ స్వచ్ఛంద సంస్థ శనివారం స్పెషల్‌డ్రైవ్ నిర్వహించింది. ఈ సందర్భంగా ఒడిశాకి చెందిన మాలతి (21), పంజాబ్‌కి చెందిన దీప (50), సోని (50), శ్రీకాకుళానికి చెందిన రాజేశ్వరి (50), విశాఖకు చెందిన శారద (26)ని టీఎస్ఆర్ కాంప్లెక్సులో గల జీవీఎంసీ-ఏయూటీడీ మహిళల నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. అలాగే, బొబ్బిలికి చెందిన భాస్కర్ (30), శ్రీకాకుళానికి చెందిన చంద్రమణి (58), రామస్వామి (65) విజయనగరానికి చెందిన గౌరినాయుడు (37), విశాఖకు చెందిన జగదీష్ (28), మొహీద్ (32), ఒడిశాకి చెందిన గురునాథ్ సుధాకర్ (49), రామబోయ్ (40), కటక్‌కి చెందిన అజయ్ (64) తదితరులను పురుషుల వసతి గృహానికి తరలించారు. వీరిలో మానసిక రోగులకు శ్రద్ధా సంస్థ ద్వారా చికిత్స చేయిస్తామని నిర్వాహకులు తెలిపారు. త్వరలో వీరందరినీ కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏయూటీడీ సంస్థ కార్యదర్శి ప్రగడ వాసు, వసతిగృహం మేనేజర్ జ్యోతిర్మయి, కేర్‌టేకర్లు పాల్గొన్నారు.

ఘనంగా సింగాలమ్మ ఆలయ వార్షికోత్సవం

కంచరపాలెం : జీవీఎంసీ 48వ వార్డు శివలింగపురంలో గల సింగాలమ్మ అమ్మవారి ఆలయ 20వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. స్థానికులు అమ్మవారికి పసుపు కుంకుమలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్పొరేటర్ గంకల కవిత, బీజేపీ వార్డు అధ్యక్షుడు అప్పారావు సింగాలమ్మకు ప్రత్యేక పూజలు చేసి అన్న సమారాధన ప్రారంభించారు.

కూచిపూడిలో ఇంద్రాణి ప్రతిభ


కూచిపూడి ప్రదర్శన ఇస్తున్న ఇంద్రాణి నరేంద్ర


లండన్‌లో ఇండియన్ హై కమిషన్ మన్ననలు పొందిన ఇంద్రాణి నరేంద్ర

దాబాగార్డెన్స్: నాట్యదీపిక అకాడమీ వ్యవస్థాపకురాలు ఇంద్రాణి నరేంద్ర లండన్‌లో ప్రతిభ చూపారు. కూచిపూడిలో డబుల్ డిప్లొమా చేసేందుకు లండన్ వెళ్లిన ఇంద్రాణి నరేంద్ర అక్కడి తెలుగు వారికి, ఆ దేశస్థులకు కూచిపూడిలో శిక్షణ అందిస్తున్నారు. ఇదిలా ఉండగా శనివారం ఆంధ్రప్రదేశ్ అవతరణ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ తరఫున కూచిపూడి ప్రదర్శన ఇచ్చి లండన్‌లో ఇండియన్ హై కమిషన్ (ఇండియన్ ఎంబసీ) మన్ననలు పొంది విశాఖ ఖ్యాతిని ఇనుమడింపజేశారు.

సీఎం సహాయ నిధికి రూ.50 వేలు అందజేత


సీఎంకు రూ.50 వేల చెక్కు అందజేస్తున్న దోలా జగదీష్

దాబాగార్డెన్స్: విజయవాడ వరద బాధితుల సహాయార్థం గత ఎన్నికల్లో స్వతంత్ర ఎమ్మెల్యే అభ్యర్థి దోలా జగదీష్ రూ.50 వేల ఆర్థిక సాయాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు శనివారం అందజేశారు.

పల్లా అప్పారావుకు నివాళి


అప్పారావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వాసుపల్లి

దాబాగార్డెన్స్: జీవీఎంసీ 28వ వార్డు కార్పొరేటర్ పల్లా అప్పలకొండ భర్త, ఆ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు సోదరుడు పల్లా అప్పారావు దశ దిన ఖర్మ శనివారం నగరంలోని వేమన మందిరంలో నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని పల్లా అప్పారావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో పీతల వాసు తదితరులు పాల్గొన్నారు.

అభయకు న్యాయం జరగాలని ధర్నా


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన చేపట్టిన నాయకులు

కంచరపాలెం: కోల్‌కతా ఆర్‌జీకార్ ఆస్పత్రిలో అత్యాచారానికి గురై, హత్య చేయబడిన వైద్యురాలు అభయకు న్యాయం జరగాలని, సీబీఐ విచారణను సత్వరం పూర్తి చేయాలని జ్ఞానాపురం పాత లారీ యార్డ్ అంబేద్కర్ విగ్రహం వద్ద పీవోడబ్ల్యు- ఐఎఫ్‌టీయూ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు ఎస్.వెంకటలక్ష్మి, ఐఎఫ్‌టీయూ నాయకుడు వై. కొండయ్య ధర్నాని ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం, పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాల వైఖరిపై సుప్రీం కోర్టు జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. పీవోడబ్ల్యూ ఉపాధ్యక్షురాలు కె.బాలనాగమ్మ, ప్రధాన కార్యదర్శి రోహిణి, కమిటీ సభ్యులు లక్ష్మి, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఫిషింగ్ హార్బర్‌లో పోర్టు చైర్మన్ ఆకస్మిక పర్యటన


ఫిషింగ్ హార్బర్‌లో పర్యటిస్తున్న పోర్టు చైర్మన్ డాక్టర్ అంగముత్తు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని పోర్టు చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ఆదేశించారు. శనివారం విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో పలు అభివృద్ధి పనులను ఆయన తనిఖీ చేశారు. పలు ప్రాంతాల్లో పర్యటించి మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అభివృద్ధి పనుల మీద చీఫ్ ఇంజినీర్(సీఈ) ప్రతి వారం పర్యవేక్షణ చేయాలని, హార్బర్‌లో మత్స్యశాఖ, బోటు ఓనర్స్ అసోసియేషన్ నాయకులతో సమావేశాలు నిర్వహించి, పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. చేపలు విక్రయిస్తున్న మహిళల వద్దకు వెళ్లి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు, వివిధ మత్స్యకార సంఘాల నాయకులు మైలపల్లి లక్ష్మణరావు (మరపడవల సంఘం అధ్యక్షుడు), బి.కొండబాబు (డాల్ఫిన్ బోటు ఓనర్స్ అధ్యక్షులు), సీహెచ్ వీర్రాజు, ఎస్.నరసింగరావు, భాస్కరరావు పాల్గొన్నారు.

కథా రచనలో కాళీపట్నందే ప్రత్యేక శైలి


కాళీపట్నం మోనోగ్రాఫ్‌ని ఆవిష్కరిస్తున్న అతిథులు

అల్లిపురం: కథా రచనలో కాళీపట్నం రామారావుది ప్రత్యేక శైలి అని ప్రముఖ రచయిత వివినమూర్తి అన్నారు. అల్లూరి విజ్ఞాన కేంద్రంలో రైటర్స్ అకాడమీ, సాహిత్య అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం జరిగిన కాళీపట్నం రామారావు శత జయంత్యుత్సవ సదస్సులో ఆయన ముఖ్య వక్తగా పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా కాళీపట్నం రామారావు చిత్రపటానికి పూలమాల వేసి అతిథులు నివాళులు అర్పించారు. అనంతరం తెలుగు సలహా మండలి కన్వీనర్ సి.మృణాళిని అధ్యక్షతన జరిగిన కాళీపట్నం రామారావు మోనోగ్రాఫ్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో వి.వి.రమణమూర్తి, కె.శ్రీనివాసరావు, మస్తాన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు వెంకటేశ్వరమెట్టపై ఉచిత దంత వైద్య శిబిరం

అల్లిపురం: వెంకటేశ్వరమెట్ట, శ్రీ వెంకట గౌరీ శంకర గ్రంథాలయం ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయ కార్యవర్గ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని గ్రంథాలయం అధ్యక్ష, కార్యదర్శులు పొలమరశెట్టి శ్యామ్‌కుమార్, పొలమరశెట్టి శ్రీను తెలిపారు.